# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 43 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 04, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు కాల్పులు

- ఎన్‌కౌంటర్‌లో 9మంది మావోల హతం



రాయపూర్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. దంతెవాడ–బీజాపుర్ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతాబలగాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 9 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## ఆక్రమణల తొలగింపునకు జిల్లాల్లోనూ హైడ్రా

- తక్షణ సాయంగా 2వేల కోట్లు ఇవ్వండి
- వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి
- కేంద్రాన్ని మరోమారు కోరిన సిఎం రేవంత్
- మహబూబాబాద్ వరద ప్రాంతాల్లో పర్యటన
- వరదనష్టంపై అధికారులతో సమీక్ష

మహబూబాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): కేంద్రం వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి 2వేల కోట్లను తక్షణ సాయంగా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదనష్టం భారీగా ఉందని, 5300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారని అన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశానని, జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరానని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు.మంగళవారం నాడు మహబూబా బాద్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అనంతరం మహబూబాబాద్ జిల్లాలో వాటిల్లిన నష్టాలపై కలెక్టరేట్‌లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు.




దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు. అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. మిగతా.. 2లో

## ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి

- రాష్ట్రానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచన

హైదరాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): రాష్ట్రప్రభుత్వం వద్ద ఉన్న ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరారు. యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 1300 కోట్లకు పైగా నిధులు ఉన్నాయని తెలిపారు. మరో రూ. 200 కోట్లు యూసీ



నిధులున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం దానికి తగిన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు. వరదల్లో చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు వస్తాయని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రూ. 5లక్షల్లో కేంద్రం ఇచ్చే రూ. 3లక్షలు కలుపుకొని ఇస్తారా? లేదా? రాష్ట్ర ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇస్తోందా? అనే విషయంపై క్లారిటీ లేదని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

అంటు వ్యాధులు సోకకుండా మెడిసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు... గణేశ్ నిమజ్జనం ఒకేరోజు జరిగిందని చెప్పారు. మళ్లీ 75ఏళ్ల తర్వాత ఇది రిపేట్ అవ్వడం సంతోషమని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

- ఆక్రమణల తొలగింపునకు పక్కా ప్రణాళిక
- ప్రకృతి విపత్తులపై బ్లూ బుక్ తయారు చేసుకోవాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై సమీక్షిస్తాం
- మూడు తండాలను కలిపి ఒకే ఆదర్శ కాలనీగా నిర్మించాలి
- పువ్వాడ ఆక్రమణల తొలగింపునకు హరీష్ సహకరిస్తారా?
- మహబూబాబాద్ జిల్లా సమీక్షల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యువ శాస్త్రవేత్త అశ్వినీ కుటుంబ సభ్యులకు ఓదార్పు
- వరద సహాయక చర్యలకు ప్రభుత్వ ఉద్యోగుల రూ.135 కోట్ల విరాళం



ఖమ్మం, మహబూబాబాద్, సెప్టెంబర్3(నమస్తే ఉదయం): ప్రకృతిని చెర బడితే అది ప్రకోపిస్తుందని.. ప్రకృతి ప్రకోపంతోనే ఉత్తరాఖండ్‌లోనైనా, మన దగ్గరైనా విపత్తులు సంభవిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించి కాలనీలకే కాలనీలే మునిగిపోవడానికి కారణం చెరువులు, నాలాల ఆక్రమణే కారణమన్నారు.

హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే డిమాండ్ వస్తోందని, కానీ ఎక్కడికక్కడ కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చెరు వుల్లో ఆక్రమణ తొలగింపును ప్రాధాన్యంగా పెట్టుకున్నామని, చెరువులు, నాలాల ఆక్రమణలో ఎంతటి వారున్నా తొలగిం పునకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ముందుగా చెరువులు, నాలాల ఆక్రమణపై నివేదిక రూపొందించుకోవాలని, ఏవైనా కోర్టు కేసులు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ లో కేవలం ఒక నాలాపై ఆక్రమణలు తొలగిస్తేనే రాం నగర్‌లో ముంపు బారి నుంచి బయటపడిన విషయాన్ని ముఖ్యమంత్రి ఉదాహరించారు.

ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో మంగళవారం విలేకరులతో ఇష్టాగోష్టిలో, మహబూబాబాద్ జిల్లా సమీక్షలో ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆకేరు వాగు పొంగడంతో కారు కొట్టుకుపోయి యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి నేరుగా సింగరేణి మండలం గంగారాం తండాలోని అశ్వినీ ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరుకున్నారు.

అశ్వినీ, మోతీలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అశ్వినీ తల్లి నేజీ, ఆమె కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించి ఓదార్చారు. అశ్వినీ అన్న అశోక్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

### ఆకేరు ప్రవాహం శాస్త్రీయ సర్వే చేపడతాం

ఆకేరు వాగు ప్రవాహంపై శాస్త్రీయ సర్వే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మిగతా.. 2లో

## తెలంగాణ విద్యాకమిషన్ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రి ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి ఈ కమిషన్ పని చేయనుంది. చైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు కానుంది. విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులను ప్రభుత్వం త్వరలోనే నియమించనుంది. చైర్మన్, సభ్యులు రెండేండ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రి ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి కమిషన్ ఏర్పాటు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఛైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. కమిషన్ ఛైర్మన్, సభ్యులను త్వరలో నియమించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నట్టు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. ఇందులో భాగంగా విద్యాకమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో భారీ నష్టం

- ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- పాలనపై పట్టులేక విపక్షాలపై సిఎం విమర్శలు
- మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ఇవ్వాలి
- ఖమ్మంలో పర్యటించిన ఎమ్మెల్యే హరీష్ రావు

ఖమ్మం,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): ఖమ్మం నగరంలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావు.. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల కారణంగా భారీ నష్టం సంభవించిందన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. మిగతా.. 2లో







## ఖమ్మంలో బిఆర్ఎస్ నాయకుల పర్యటన

- మాజీమంత్రి పువ్వాడ వాహనంపై రాళ్లదాడి
- ఒకిరికి గాయాలు..ఘటనపై మండిపడ్డ కెటిఆర్

ఖమ్మం,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): తెలంగాణలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాధితులను ప్రభుత్వం అండగా నిలిచి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు ఖమ్మం జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అయితే ఈ పర్యటనలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాహనంపై కొంతమంది వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. ఒకరికి కాలు విరగడంతో ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన మిగతా.. 2లో

## తెలంగాణ ఉద్యోగుల ఉదారత

- వరద బాధితులకు ఉడతాభక్తి సాయం
- ఒకరోజు వేతనం 130 కోట్లు విరాళం ప్రకటన

హైదరాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ఉదారత చాటుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు అతలాకుతల మైన సంగతి తెలిసిందే. తినడానికి తిండి లేక.. తాగడానికి నీళ్లు లేక పలు ప్రాంతాల ప్రజలు వరదలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతు న్నారు. ఇది చూసి



చలించిపోయిన ఉద్యోగులు పెద్ద మనసు చాటుకున్నారు. వరద బాధితుల కోసం ఒకరోజు వేతనంని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ మంగళవారం ఉదయం కీలక ప్రకటన చేసింది. జేఏసీ ప్రకటించిన మొత్తం కాగా.. విరాళం ప్రకటించిన వారిలో ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఉన్నారు. వీరంతా ఒకరోజు తమ జీతంను.. సెప్టెంబర్ నెల జీతం నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి ఓ ప్రకటన రిలీజ్ చేశారు.



## ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాల విలీనం

- సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం): ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు విలీన జాబితాలో ఉన్నాయి. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో.. బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతిపేట పంచాయతీలు విలీనం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో.. మీర్జాగూడ గ్రామపంచాయతీ , తుక్కుగూడ మున్సిపాలిటీలో.. హర్షగూడ గ్రామపంచాయతీ, మేడ్చల్ మున్సిపాలిటీలో.. పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరి పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి, గారం మున్సిపాలిటీలో.. బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు, పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివాని సింగారం, చౌదరిగూడ విలీనం అవుతాయి. ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనం అవుతాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో.. మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి.

## ఆక్రమణల తొలగింపునకు
# జిల్లాల్లోనూ హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం అన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?అని ప్రశ్నించారు. 680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలని అన్నారు.రదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

## ఖమ్మంలో బిఆర్ఎస్ నాయకుల పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

మంచి కంటి నగర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈరోజు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయటం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలకు సాయం చేయటం చేతగాక.. సాయం చేస్తున్న నేతలను చూసి ఓర్వలేకే ఈ దాడికి తెగబడ్డారని విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి తాము అండగా ఉండటమే తప్పా? అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయటం చేతకాదు...సేవ చేసే వాళ్లపై మాత్రం దాడి చేయటం? సిగ్గు చేటు అని అన్నారు. ఈ దాడికి ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఎన్ని చేసినా సరే...ప్రజల వద్దకు బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

## సెబీ చీఫ్ మాధవీపురి బుచ్‌కు జీతం

### ఐసీఐసీఐ బ్యాంక్ తీరుపై కాంగ్రెస్ ప్రశ్నలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** సెబీ చీఫ్ మాధవీ పురి బుచ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. మాధవికి తాము ఎలాంటి వేతనమూ చెల్లించడం లేదంటూ ఐసీఐసీఐ బ్యాంక్ ఇచ్చిన వివరణపై మరిన్ని ప్రశ్నలను సంధించింది. ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాలు మాత్రమే చెల్లిస్తున్నామని చెబుతున్న బ్యాంక్.. ఆ మొత్తం జీతం కంటే ఎక్కువ ఎలా ఉంటుందని ప్రశ్నించింది. మధ్యలో ఏడాది పాటు ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వకపోవడాన్నీ నిలదీసింది. సెబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా మాధవీ పురి బుచ్‌కు ఐసీఐసీఐ బ్యాంకు నుంచి జీతభత్యాలు అందుతున్నాయంటూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. 2017లో ఆమె సెబీలో చేరినప్పటి నుంచి, ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు అధికారి హోదాలో రూ.16.08 కోట్లు అందుకున్నారని, ఇదే కాలంలో సెబీ నుంచి ఆమెకు అందింది కేవలం రూ.3.3 కోట్లని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేడా ఆరోపించారు. దీనిపై స్పందించిన ఐసీఐసీఐ బ్యాంక్.. తాము ఎలాంటి వేతనం చెల్లించడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో పవన్‌ఖేడా మంగళవారం మరోసారి మీడియా సమావేశం నిర్వహించారు. మాధవికి చెల్లిస్తోంది కేవలం పదవీ విరమణ ప్రయోజనాలే అని బ్యాంక్ చెప్తోందని, మరి ఆ మొత్తం ఎందుకు జీతం కంటే ఎక్కువ ఉందని పవన్ ఖేడా ప్రశ్నించారు. 'ఆమె పదవీ విరమణ చేసిన అనంతరం 2014-15లో ఐసీఐసీఐ బ్యాంక్ పదవీ విరమణ ప్రయోజనాల్లో భాగంగా రూ.5.03 కోట్లు చెల్లించారు. మధ్యలో 2015-2016లో ఎందుకు చెల్లించలేదు. మళ్లీ 2016 నుంచి 2021 వరకు మాత్రమే ఎందుకు చెల్లింపులు చేపట్టారు?' అని ప్రశ్నించారు. 2007 నుంచి 2013-14 వరకు ఆమె సగటు వేతనం రూ.1.3 కోట్లు కాగా... 2016-17 నుంచి 2020-21 వరకు ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సగటున ఏటా రూ.2.77 కోట్లు ఎలా చెల్లించారని, జీతం కంటే ప్రయోజనాలు ఎక్కడైనా ఎక్కువ ఉంటాయా? అని నిలదీశారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వాళ్లు ఎంఎ÷-లాయీ స్టాక్ ఆప్షన్లను 10 ఏళ్ల వరకు ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ సోమవారం తన వివరణలో పేర్కొంది. మరి అదే బ్యాంక్.. అమెరికా సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమర్పించిన ఎసాప్స్ పాలసీలో మూడు నెలలే అని ఎందుకు పేర్కొంది? అని ప్రశ్నించారు. ఒకవేళ మాధవికి సవరించిన పాలసీ ప్రకారమే స్టాక్ ఆప్షన్లు వాడుకునే వీలు కల్పించి ఉంటే.. మరి ఆ పాలసీని ఇంత వరకు పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదు? అని నిలదీశారు. కంపెనీ షేరు ధర గణనీయంగా పెరిగిన తర్వాత లబ్ధి పొందేందుకు ఎసాప్స్‌ను వాడుకోవడానికి మాధవిని ఎలా అనుమతించారు. అదీ ఆమె సెబీ చీఫ్‌గా ఉన్నప్పుడే ఎలా ఇచ్చారని పవన్ ఖేడా నిలదీశారు.

## కేన్స్ గుజరాత్‌కు తరలిపోతున్నమాట నిజమేనా?

◆ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** కేన్స్ సంస్థ తెలంగాణలో పెడతామన్న తన యూనిట్‌ను గుజరాత్‌కు తరలి చేందుకు సిద్ధమైందని వార్తలు వస్తున్నాయి. అది వింటుంటే చాలా బాధని పిస్తోంది. ఈ సంస్థను కర్ణాటక నుంచి తెలంగాణకు రప్పించేందుకు ఎంతో కష్టపడ్డాం. హైదరాబాద్‌లో తమ యూనిట్ పెట్టాలంటే కొంగర కలాన్ లోని ఫాక్స్ కాన్ ప్లాంట్ పక్కన భూమి కేటాయించాలని వారు కోరారు. పది రోజుల్లోనే వారికి భూమి కేటాయించి తెలంగాణలో యూనిట్ పెట్టేందుకు ఒప్పించాం. దీంతో వాళ్లు గతేడాది అక్టోబర్‌లో తమ యూనిట్‌ను మన రాష్ట్రంలో పెడతామని ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆ సంస్థ గుజరాత్ కు తమ యూనిట్ ను తరలిస్తుందన్న వార్తలు చూస్తుంటే చాలా బాధనిపిస్తోంది. ఎంతో కష్టపడి కేన్స్ సంస్థ మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పిస్తే ఇప్పుడు ఆ సంస్థను తరలిపోకుండా కాపాడలేకపోతున్నారు.

# ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో భారీ నష్టం

(మొదటి పేజీ తరువాయి)

తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా ప్రజలను కాపాడలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. పాలనపై పట్టుకోల్పోయిన సీఎం.. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందన్నారు. కట్టు బట్టలు తప్ప తమవద్ద ఏమీ లేవని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్ రావు తెలిపారు.

వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్పోయిన వస్తువులకు రూ. 2 లక్షల ఆర్థిక పరిహారం ఇవ్వాలన్నారు. ఎంతో



మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయని.. వారి సర్టిఫికెట్లను వారికి ఇప్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం మంచినీళ్లు, అన్నం కూడా అందించలేకపోయారని ప్రభుత్వం తీరుపై హరీష్ రావు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం కారణంగా ఈ ఘోరం జరిగిందని హరీష్ రావు విమర్శించారు. వరదల కారణంగా 28 మంది చనిపోతే.. ప్రభుత్వం మాత్రం 16 మందిని మాత్రమే చూపిస్తోందని ఆరోపించారు. భక్త రామదాసు, పాలమూరు ప్రాజెక్టులు మునిగిపోయాయని.. దీనంతటికీ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే అని తూర్పారబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి కారణంగా వేల ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో పంట నష్టానికి రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని.. ఇప్పుడు పంట నష్టానికి ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే పొలాలు బాగు చేసుకోవడానికి రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. అధికారంలో ఉండి.. ప్రతిపక్షం సహాయం చేయాలని అడుగున్నారని ప్రభుత్వం పెద్దల తీరుపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చేతకానితనాన్ని, వారికి అంటిన బురదను ప్రతిపక్షంపై చల్లే కుట్ర చేస్తోన్నారని ఆరోపించారు. వరదలపై రాజకీయం చేస్తు?న్న ముఖ్యమంత్రిని తొలిసారి చూస్తున్నామన్నారు. ప్రభుత్వం తరపున ఖమ్మం వచ్చిన ఆరుగురు ప్రముఖులు ఉపన్యాసాలు చెప్పారు తప్ప.. ప్రణాళిక గురించి మాట్లాడారా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారని.. అందుకే ముఖ్యమంత్రి వచ్చారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఓ అమ్మాయ మీద దాడి చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని విమర్శించారు. ఆ అమ్మాయిని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ప్రజల కష్టాల తెలుసుకోవడాని వస్తే తమపైనా దాడి చేశారని కాంగ్రెస్ శ్రేణులపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేయడమే కాంగ్రెస్ ప్రజా పాలనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తమ బాధ్యత



అని ఉద్ఘాటించారు. వరద బాధితులకు ఇంటికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలన బాగుందని ప్రజలే అంటు న్నారని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కాగా, ఖమ్మం వరదల్లో చిక్కుకున్న బాధితులను కాపాడిన వారిని అభినందిస్తున్నట్లు హరీష్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా వరద బాధితులకు సహాయం అందిస్తామన్నారు. బుధవారం నాడు సిద్దిపేట నుంచి 4 లారీలలో ఆహార పదార్థాలతో తమ నాయకులు బయలుదేరుతారని.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు సాయం అందించబోతున్నారని హరీష్ రావు తెలిపారు.

కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా తేరుకుని.. బాధితులను కాపాడాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు.

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆకేరు వాగు పొంగడంతో ప్రతి సారి తాము ముంపు బారిన పడుతున్నామని సీతారాం తండా వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. గంగారాం తండాలో అశ్వినీ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు వాగు పొంగి కల్వర్టు, రహదారి తెగిపోయిన ప్రాంతానికి చేరుకొని దానిని పరిశీలించారు.

అక్కడే అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ పయనిస్తున్న కారు ఆకేరు వాగు ప్రవాహానికి కొట్టుకుపోయి వారు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతాన్ని, ఆకేరు వాగును, కల్వర్టు కొట్టుకు పోయిన తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. వాగు ప్రవాహ ఉధృతి ఎలా ఉంటుంది.. గతంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయా అని ముఖ్యమంత్రి స్థానికులను ప్రశ్నించారు.

ప్రతిసారి వాగు పొంగడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రహదారి గతంలోనూ తెగిందని స్థానికుడు జర్పుల లక్ష్మణ్ ముఖ్యమంత్రికి తెలిపారు. అక్కడి నుంచి ఆకేరు పొంగి ముంపు బారిన పడిన సీతారాం తండాకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. తండాలో ఇళ్లు మునిగిన వారిని ఓదార్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామని, ఆకేరు వాగు పొంగిన ప్రతిసారి తమ తండాతో సమీపంలోని మరో రెండు తండాలకు నిద్ర ఉండడం లేదని, తమను రక్షించాలని ముఖ్యమంత్రిని తండా వాసులు కోరారు.

తండా వాసులను ఓదార్చిన అనంతరం ముఖ్యమంత్రి వారిని ఉద్దేశించి మాట్లాడారు. మూడు తండాలను కలిపి ఒకే చోట మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తామని.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగి ఇళ్ల లోని పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్స్ తడిచిపోయినందున ఒకే FIR దాఖలు చేసి అందరికీ నూతన కార్డులు, సర్టిఫికెట్స్, పాసు పుస్తకాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు వరదతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### అప్రమత్తతతో ముప్పు తగ్గించగలిగాం

గతంలో ఎన్నడూ లేనంతగా మహబూబాబాద్ జిల్లాలో వర్షపాతం నమోదైనా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించగలిగామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న పంట, ఆస్తి నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి తిలకించారు. అనంతరం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తాము ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఊహించని వర్షాలు, వరదలతో మహబూబాబాద్ జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు ఇద్దరని ముఖ్యమంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.... ఎకరాకు రూ.పది వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో ముంపు బారిన పడిన 680 మందిని సహాయక శిబిరాలకు తరలించామని సీఎం చెప్పారు. సీతారాం తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఎస్సై నగేష్ కి అభినందనలు తెలిపారు. జిల్లాలో విపత్తు సమయంలో సత్వరం స్పందించిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. జిల్లాల్లో విపత్తుల సమయంలో ఏం జరిగింది.. ఆ సమస్యను ఎలా అధిగమించారు... ఎలా సహాయక చర్యలు తీసుకున్నారనే దానిపై బ్లూబుక్ రూపొందించుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఆ బ్లూ బుక్ భవిష్యత్‌లో వచ్చే అధికారులకు విపత్తుల సమయంలో కరదీపికగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

### పువ్వాడ అజయ్ ఆక్రమణల తొలగింపునకు హరీష్ సహకరిస్తారా?

ఖమ్మం ముంపు బారిన పడడానికి మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణలే కారణమని తనకు ఫిర్యాదులు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఇష్టారీతిగా కాలువలు ఆక్రమించారని, దాంతో ఖమ్మం ముంపు బారిన పడిందని తాను పరామర్శిస్తున్నప్పుడు స్థానికులు చెప్పారన్నారు. పదేళ్ల కాలం నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు ఈ ఆక్రమణలపై ఏమంటారని, వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లు హరీష్ రావు ఇప్పుడు బాధితుల పరామర్శకు బయలుదేరారని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణల తొలగింపు నకు హరీష్ రావు చిత్తశుద్ధితో సహకరిస్తారా..? దగ్గర ఉండి ఆక్రమణలు తొలగింపజేస్తారా అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ఖమ్మంలో పువ్వాడ ఆక్రమణలకు సంబంధించి వాస్తవాలు వెలికితీయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక తొలిసారిగా వేసిన టెండర్ ఖమ్మం మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుకేనని ముఖ్య మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అంతకు మించిన ఎత్తులో నీరు వచ్చినందున.. ఆ ఎత్తు పెంపు సమీక్షిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

### రెండింటిని పోల్చి చూసుకోండి

తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలు కవల పిల్లల వంటివని, కృష్ణాతో పోల్చితే ఖమ్మంలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మరింత నష్టం వాటిల్లకుండా చూసుకోగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. తాను కంటిపై కునుకు లేకుండా పర్యవేక్షణ చేశానని సీఎం చెప్పారు. ప్రకృతి విపత్తుల సమయంలో త్వరగా చేరుకోవడానికి వీలుగా హెలీకాప్టర్లను పంపుతారని, ఖమ్మానికి విజయవాడ దగ్గర ఉన్నందునే అక్కడకు హెలీకాప్టర్లు చేరుకున్నాయని.. ఈ సమయంలో ప్రాంతం, రాజధాని వంటివి చూసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. భారీగా నష్టం వాటిల్లినందునే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంలో పర్యటించాలని కోరామని ముఖ్యమంత్రి తెలిపారు.

### ఏనాడైనా బాధితులను పరామర్శించారా?

పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఏనాడైనా వరద, ప్రమాద బాధితులను పరామర్శించారా అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద బాధితుల వద్దకు ఏనాడూ కేసీఆర్ వెళ్లలేదని, సొంత నియోజవకర్గం మాసాయిపేటలో రైలు ప్రమాదంతో చిన్నారులు చనిపోయినా, హైదరాబాద్ ఓఆర్ఆర్ లో పశు వైద్యురాలు అత్యాచారానికి, హత్యకు గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించలేదని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నేతలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని కేసీఆర్ ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న కేటీఆర్ క్షేత్రంలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో దోచుకున్న రూ.లక్ష కోట్ల నిధుల్లో రూ.వెయ్యి కోట్లో... రూ. రెండు వేల కోట్లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని కేసీఆర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచించారు.



### సీఎంఆర్ఎఫ్ కు విరాళాలు

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు గానూ ముఖ్య మంత్రి ఉపశమన నిధి (సీఎంఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గులు తమ ఒక రోజు మూల వేతనం రూ.135 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.మహబూబాబాద్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు రాష్ట్రంలో వరద సహాయక చర్యలకు తాను దాచుకున్న రూ.3 వేలను ముఖ్యమంత్రికి అందజేశారు. విద్యార్థినిని ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలోని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. మహబూబాబాద్ జిల్లా సమీక్షలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రామచంద్ర నాయక్, యశస్విని రెడ్డి, గండ్ర సత్యానారాయణరావు, నాగరాజు, కోరం కనకయ్య, అధికారులు పాల్గొన్నారు.

## వరద నష్టాలను అంచనా వేయండి

### అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వలన జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వర్షాలు, వరదల వలన జరిగిన నష్టం అంచనా వేయడం పై నేడు సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ ఓ డీ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ డా.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీ గుప్తా, వికాస్ రాజ్, అర్వింద్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, నవీన్ మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, లోకేష్ కుమార్, రోనాల్డ్ రోస్, ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఇప్పటికీ అనేక జిల్లాల్లో వరదలు, వానలు తగ్గుముఖం పట్టలేదని అన్నారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, తగు జీపీఎస్ కోఆర్డినెట్ లతో సహా సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫోర్స్ లను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలని అన్నారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సీఎండీ ముషారాఫ్ అలీలు కూడా పాల్గొన్నారు.

## సిఎంకు చెక్కును అందించిన ఉద్యోగ సంఘాలు

### సిఎం రిలీఫ్ ఫండ్‌కు 3వేలు అందించిన విద్యార్థి

**మహబూబాబాద్,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో వరద సహాయక చర్యలకు తమ ఒక రోజు మూల వేతనం రూ. 130 కోట్లను తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేసారు.

ఈ మేరకు వారు సిఎంను కలసి తమ వంతు సాయం అందించారు. ఉదయం సమావేశమై ఉద్యోగుల జెఎసి నిర్ణయం తీసుకుంది. ఇదిలావుంటే వరద సహాయక కార్యక్రమాలకు తన కిట్టీ బ్యాంకు నుంచి రూ.3వేలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబాబాద్ జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు అందజేసింది. తెలుగు రాష్టాల్లో వరదలు ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలో మహబూబాబాద్ లో ఓ చిన్నారి సీఎం రేవంత్‌కు తన కిడ్డీ బ్యాంకు నుంచి రూ. 3 వేలను వరద సహాయనిధిని అందించింది. తెలంగాణలో భారీ వర్షాలు జనజీవనాన్ని కకావికలం చేస్తున్నాయి. సర్వం కోల్పోయి గుక్కెడు మంచి నీళ్లు, ఆహారం కోసం దీనంగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరాశ్రయులకు సహాయం అందించేందుకు అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి.

పదో తరగతి చదువుచున్న ముత్యాల సాయి సింధు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.3 వేల రూపాయిలు అందించింది. తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు వరదల కారణంగా తీవ్ర ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంభవించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 21 మంది ప్రాణాలు పోయాయి. భారీగా ఆస్తి నష్టం, పంట నష్టం సంభవించింది. వరదల కారణంగా అనేక గ్రామాలలో పరిస్థితి దారుణంగా ఉన్నాయి. అనేక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి

## 32 వేల రూపాయలు, ఒక స్కూటీ, ఒక మొబైల్ స్వాధీనం

## 11మంది పై కేసు నమోదు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం):**
పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. ఈ ఘటన గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల మండలం పూడూరు శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు రూరల్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 11మంది వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి రూ.32,000 నగదు, ఒక స్కూటి వాహనం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో మేళ్లచెర్వు గ్రామానికి చెందిన వినోద్ చరణ్, జానీ (చంద్రన్న), ప్రభాకర్, కుర్వపల్లి గ్రామానికి తిమ్మప్ప, పరుష, ఆంజనేయులు, కొండపల్లి గోవర్ధన్, దౌదర్ పల్లి నరసింహ, గద్వాల తిమ్మన్న ,మార్ల బీడు సుధాకర్ ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణి

**గద్వాల(ధరూర్), సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం)::**
ధరూర్ మండలం జాంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐకెపి సెర్ప్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన రెండవ దఫా యూనిఫామ్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేవతి మాట్లాడుతూ... విద్యార్థులు



ఉన్నత లక్ష్యంతో చదివి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తేవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు, సిసి నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం చేస్తాం

## - ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## బాధితులను పరామర్శించిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం):**
ధరూర్ మండల పరిధిలోని మార్లబీడు గ్రామానికి చెందిన డబ్బా నర్సింహులు హనుమాన్ కిరణం జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దుకాణం దగ్ధం కావడంతో సుమారు రూ.3లక్షల అస్తినష్టం వాటిలింది. విషయం తెలుసుకున్న గద్వాల



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మంగళవారం మార్లబీడు గ్రామంలో కిరణం జనరల్ స్టోర్ ను షాపును సందర్శించి షాప్ యజమాని డబ్బా నరసింహులను పరామర్శించారు. ఏ విధంగా షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగినది విషయాన్ని తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా తన వంతు ఆర్థిక సహాయాన్ని కూడా ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్ విజయ్, శ్రీరాములు, ఆనంద్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి

# సంక్షేమ ఫలాలు

## - ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## షాదీముబారక్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం):**
గద్వాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. గద్వాల మండలం, మున్సిపాలిటీ పరిధిలోని షాదీ ముబారక్ పథకం కింద మంజూరయిన చెక్కులను 47మంది అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, గద్వాల మున్సిపల్



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

వైస్ చైర్మన్ బాబర్,కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, పూడూరు కృష్ణ, రిజ్వాన్, ప్రియాంక, మాజీ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్ గౌడ, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, గోపీ రెడ్డి, మాజీద్, సతీష్, షకుర్, గోవిందు, ధర్మ నాయుడు, నరేందర్ రెడ్డి, రాముడు , కురుమన్న, వంట భాస్కర్, లక్ష్మీ కాంత్ రెడ్డి, కేశవరెడ్డి, పూడూరు శ్యామ్, పూడూరు రఘు, అన్వర్ , మోబిన్, పవన్ యూదవ్, ఫయాజ్, గంట రమేష్, అన్వర్, దౌలన్న,నపూడూరు చిన్నయ్య, గోపాల్, రంజాత్, వీరేష్, కొత్త గణేష్, శ్రీనివాస్ యాదవ్, రామచందర్, బాలాజీ, రఘు, ప్రవీణ్, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.







అవార్డు అందుకుంటున్న ప్రభాకర్ రెడ్డి, అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజశేఖర్, అవార్డుతో ఎస్. నర్సింగ్ రావు

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురికి అవార్డులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్3(నమస్తే ఉదయం):**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం సంస్థలో పనిచేస్తున్న అధ్యాపకులకు, శాస్త్ర వేత్తలకు, ఉద్యోగులకు, విద్యార్థులకు, వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులను అందజేశారు. ఉత్తమ రైతులను సన్మానించి నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు బహుకరించారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి జే రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఎం. రఘునందన్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామిరెడ్డిలు పాల్గొన్నారు.

### అవార్డులు పొందిన వారు వీరే :

వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బెస్ట్ టీచర్ అవార్డును డాక్టర్ ఎన్ బలరాం అందుకున్నారు. ఆయనకు రూ.10 వేల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ ను అందజేశారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును డాక్టర్ ఎం.వెంకటయ్య అందుకున్నారు. ఆయనకు రూ 10వేల నగదు పురస్కారాన్ని అందజేశారు.



బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ అవార్డు పొందిన రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ

బెస్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ టి ఎల్ నీలిమ, డాక్టర్ ఎస్ ఓం ప్రకాష్ (వరంగల్)లు అందుకున్నారు.

బెస్ట్ ఎక్స్టెన్షన్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ కే రవికుమార్ వైద ఎం రాజశేఖర్ విత్ హైయెస్ట్ నాస్ అవార్డులు డాక్టర్ పి సుజాత అందుకున్నారు.

బెస్ట్ టీచర్, రీసెర్చ్, ఎక్స్ టెన్షన్ సైంటిస్ట్ విత్ హ యెస్ట్ ఫండెడ్ ప్రాజెక్ట్ అవార్డును డీన్ పీజీ స్టడీస్ గా ఉన్న డాక్టర్ వి అనిత అందుకున్నారు.

బెస్ట్ టీచర్ అవార్డును డాక్టర్ ఎ. మీనా, బెస్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డును డాక్టర్ సంధ్య కిషోర్, అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ వర్క్ ఇన్ సాయిల్ సైన్స్ లో డాక్టర్ జి కిరణ్ రెడ్డి, డిప్లొమా అగ్రికల్చర్ లో గోల్డ్ మెడల్లో కె. నికిత తీసుకున్నారు. అవార్డులు పొందిన వారిలో డాక్టర్ పి.జగన్మోహన్ రావు, డాక్టర్ ఎ. గీత, ఎం రాజశేఖర్‌లు ఉన్నారు.

నాన్ టీచింగ్ విభాగంలో ఎల్ బి మురళీమోహన్ , ఎం దశరథ , జి సుదర్శన్, జె ప్రభాకర్ రెడ్డి , ఎ. పద్మ , ఎస్ నర్సింగ్ రావు, రమేష్ భూక్య, మహమ్మద్ ఉమర్ అహ్మద్, ఎస్ రమణ, సీహెచ్ రమేష్, బి. శంకు స్వామి, ఎం మహేష్ , జె.రాజా రామ్, సిహెచ్ సురేష్, ఎం నాగార్జున అవార్డులను అందుకున్నారు.

రికార్డు అసిస్టెంట్ విభాగంలో కె పాండు, కె. కిషన్ , బి శారద, ఫాతిమా బీ, జే వెంకటమ్మ , టీ పోసు లు అవార్డులు అందుకున్నారు.

బెస్ట్ ఇనిస్టిట్యూషన్ అవార్డుల విభాగంలో బెస్ట్ కాలేజీగా వరంగల్ వ్యవసాయ కళాశాల, బెస్ట్ రీసెర్చ్ స్టేషన్‌గా రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ , బెస్ట్ ఎక్స్ టెన్షన్ సెంటర్ గా మాల్యాల్ కే వీ కే, బెస్ట్ పాలిటెక్నిక్ కాలేజ్‌గా జగిత్యాల్ పలాస అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలు అవార్డులందుకున్నాయి.



అగ్రి డిప్లొమాలో గోల్డ్ మెడల్ సాధించిన కె నిఖిత



సమావేశానికి హాజరైన ఉద్యోగులు, ఇతర ప్రముఖులు

# ఆశలను కార్మికురాలుగా గుర్తించి కనీస వేతనము నెలకు 26,000 ప్రకటించాలి

## - ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జే భాగ్య

**కొత్తకోట,సెప్టెంబర్ 3 (నమస్తే ఉదయం):**
కేంద్ర ప్రభుత్వము ఆశలను 45, 46 వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు అమలు చేసి కార్మికులుగా గుర్తించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జే భాగ్య అన్నారు. మంగళవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ధర్నా నిర్వహించి హెల్త్ సూపర్వైజర్ ప్రమీలకు వినతిపత్రం ఇస్తూ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కనీస వేతనం నెలకు 26 వేలు చెల్లించాలని పిఎఫ్ ఈ ఎస్ ఐ ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని ఆమె కోరారు. నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ ఉన్నామని కరోనా లాంటి మహమ్మారి కాలంలో కూడా ఆశ వర్కర్స్‌ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలు అందించామని ఆమె చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ అంతర్జాతీయ సంస్థ ఆశ వర్కర్ల సేవలను



వినతి పత్రాన్ని అందిస్తున్న ఆశ వర్కర్స్

గుర్తించి గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో ఆసుపత్రిలో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశలు కీలకపాత్ర పోషిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న ఆశలను కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు మంజుల, పుష్ప,సుజాత,దేవి, రేణుక,ఇందిర, బుజ్జమ్మ, చంద్రకళ, కాంచన,మహేశ్వరి,శ్వేత,ఎస్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఎన్ అశ్వినీ పేరిట గోల్డ్ మెడల్‌ను ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తున్న విద్యార్థులు,



అవార్డు అందుకుంటూ... అశ్వినీ

# డాక్టర్ ఎన్ అశ్వినీ పేరున బంగారు పతకం ఏర్పాటు చేయాలి: కాటమ్ శ్రీధర్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్3(నమస్తే ఉదయం):**
మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయిగూడెం ఆకేరు వాగులో కొట్టుకుపోయిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ అశ్వినీ పేరు మీద వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విద్యార్థుల సంఘం నాయకుడు డాక్టర్ కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం వద్ద నినాదాలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి డాక్టర్ కాటం శ్రీధర్ మాట్లాడుతూ అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చరల్ పూర్తి చేసి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఎంఎస్సీ, పీహెచ్ డీ చదివి యూనివర్సిటీ స్థాయిలో ఆరు గోల్డ్ మెడల్ లు సంపాదించిన డాక్టర్ అశ్విని పేరుతో గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయాలని కోరారు.

చదువు అనంతరం బెంగళూరులో ఐసీఏఆర్ సంస్థలో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ అశ్వినీ స్వగ్రామానికి వచ్చి తిరిగి బెంగుళూరుకు వెళ్ళడానికి తండ్రి మోతిలాల్ నాయక్‌తో కలసి కారులో హైదరాబాద్ వెళుతుండగా మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయిగూడ వద్ద ఆకేరు వాగులో కొట్టుకుపోయిందన్నారు. తండాలో జన్మించి వ్యవసాయ విద్యలో ఉన్నత చదువులు చదివి ఒక శాస్త్రవేత్తగా స్థిరపడుతున్న సమయంలో అకాల వర్షం, వరద బీభత్సం కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ అశ్వినీ మరణించిందని అన్నారు. ఆమె ఆమె జ్ఞాపకార్థం వ్యవసాయ విశ్వవిద్యాలయం గోల్డ్ మెడల్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి:అలంపూర్ సిఐ రవిబాబు

**అలంపూర్ ,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని అలంపూర్ సిఐ రవిబాబు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు. మంగళవారం అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ , మండలం లోని గణేష్ కమిటీ నిర్వాహకులతో వివిధ మత పెద్దలతో శాంతి మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ రవి బాబు మాట్లాడుతూ... రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల దగ్గర అనుమతి తీసుకోవాలని కోరారు. ఎవరిని ఇబ్బందుల గురి చేయకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల దగ్గర జాగ్రత్తలు పాటించాలని కోరారు.

### గణేష్ ఉత్సవాల మండల కమిటీ ఎన్నిక

గణేష్ ఉత్సవ కమిటీ అలంపూర్ మండల అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలంపూర్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అలంపూర్ మండల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలలో గణేష్ మండపాలు నిర్వహించే సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడుగా శేఖర్ రెడ్డి ఉపాధ్యక్షుడుగా నర్సన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.బి సంజీవ నాయుడును ఎన్నుకున్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందేలా కృషి చేస్తా: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం):** కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని ఎస్వీఎం డిగ్రీ కళాశాల సమీపంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారికి శిక్షణ కేంద్రాన్ని పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీకే అరుణ మాట్లాడుతూ...

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు

ఈ సందర్భంగా మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణమ్మ మాట్లాడుతూ... ఈ పథకం కింద ప్రయోజనాలను పొందేందుకు రుణ గ్రహీతలకు డిజిటల్ ఐడి పీఎం విశ్వకర్మ డిజిటల్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈ శిక్షణ కాలంలో రుణాగ్రహీతలకు టైలరింగ్ పథకంకు సంభవించిన రూ.15,000 వరకు టూల్ కిట్ ప్రోత్సహకం అందిస్తుందని అన్నారు. వృత్తి శిక్షణ కేంద్రంలో 7రోజుల ప్రాథమిక శిక్షణ పూర్తి అయిన తర్వాత రోజుకు రూ.500 ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 18 రకాల చేతివృత్తులు కార్పెంటర్, కమ్మరి, గోల్డ్ స్మిత్, కుమ్మరి, మేస్త్రీలు, చాప ,చీపుర్లు, మొదలగు పనిచేసే వారికి ఈ పథకం వర్తింపచేస్తుందని మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.



### సాంప్రదాయ హస్తకళలను కాపాడటం:

చేతివృత్తుల వారికి నైపుణ్యాలకు తోడ్పాటు అందించడం ద్వారా భారతదేశం యొక్క వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళల వారసత్వాన్ని కాపాడటం, ప్రోత్సహించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఈ నిబద్ధత భవిష్యత్ తరాలకు పాత- పద్ధతులను ప్రసారం చేయడానికి నిర్ధారిస్తుంది.

ఈ సంప్రదాయాలు కొనసాగడానికి,అభివృద్ధి చెందడానికి అనుమతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట రాములు, అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసు, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహా,కిష్టన్న, డబ్బిలేటి నరసింహా, చిత్తారి కిరణ్, తదితరులు హాజరయ్యారు..



# అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందేలా కృషి చేస్తా

## - ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 3(నమస్తే ఉదయం):** అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు అందేలా కృషి చేస్తానని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం

కొత్త రేషన్ కార్డులు అర్హులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో రాష్ట్రంలోనే మొదటిసారి రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశంలో ప్రజలకు రేషన్ డీలర్లకున్న సమస్యలపై చాలా అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...

గతంలో మూడునెలలు రేషన్ తీసుకోకుంటే కార్డులను తీసేశారని, వాటిని పునరుద్ధరించాలని,

తెల్ల రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వం నుండి వస్తున్న పథకాలను పొందలేక నిజమైన అర్హులు ఇబ్బంది పడుతున్నారని, అంత్యోదయ కార్డును దివ్యాంగులకు, విడోస్‌కు, HIV పేషెంట్లకు,డయాలిసిస్ పేషెంట్లకు , కుష్టు వ్యాధి గ్రస్తులకు వర్తింపజేయాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పౌరసరఫరాల శాఖల అధికారులకు సూచించారు. రేషన్ కార్డు జారీ తర్వాత పుట్టిన పిల్లల పేర్లు రేషన్ కార్డులో చేర్చడం, పెళ్లి చేసుకుని అత్తగారింటికి వెళ్ళిన ఆడ పిల్లల పేర్లను తొలగించి,అదే విధంగా కుటుంబంలోకి కొత్తగా వచ్చిన వారి పేర్లను చేర్చి, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని.. ఇలా ఎప్పటికప్పుడు పేర్లను తొలగిస్తూ, అవసరమైన వారి పేర్లను చేర్చితే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు.

# వర్షానికి దెబ్బతిన్న ఇల్లు, చెరువుల సర్వేలను చేపట్టాలి: జిల్లా కలెక్టర్ శశాంక్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్3(నమస్తే ఉదయం)** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్ల, పూర్తిగా నష్టం జరిగిన ఇండ్ల వివరాలు, చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయుటపై మంగళవారం జిల్లా కలెక్టర్ శశాంక ఆర్డీఓలు, తహాశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ... గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో దాదాపు 40 ఇండ్లు పాక్షికంగా, రెండు ఇండ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించామని, వీటికి సంబంధించి ఏ మేరకు నష్టం వాటిల్లిన వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమైన ఇండ్ల నష్టపరిహారనికి సంబంధించిన నివేదికలు వెంటనే కలెక్టరేట్ కు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్



అధికారులు సమిష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఆర్డీఓలు, తహాశీల్దార్లు తమ పరిధిలోని ఏదైన విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె వేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లాలోని 100 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటి వరకు 925 చెరువులలో 99 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 820 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయవలసి ఉన్నదని, వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి వారానికి 30 నుండి 40 చెరువులను సర్వే నిర్వహిస్తే సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కోర్టు కేసులకు సంబంధించి ఆయా కోర్టులలో అధికారులు వెంటనే తగిన సమాచారం అందించి స్పందించాలని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో లాండ్ ప్రొటెక్షన్ అధికారి కె.ఎస్.బి. కుమారి, మండలాల నుండి తహశీల్దార్లు, ఆర్డీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ దాడుల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహబూబ్ నగర్‌లో డిఎస్టీఓ

## రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టు బడిన డిఎస్టీఓ

## గద్వాలలోని ఆయన నివాసంలో ఏసిబి సోదాలు



**గద్వాల ప్రతినిధి,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** జీఎస్టీ లైసెన్స్ కోసం ఓ వ్యాపారి నుంచి లంచం తీసుకున్న డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డిని మంగళవారం ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్ నగర్ మర్లులోని ఓ వ్యాపారి సీడ్స్ అండ్ స్క్రాప్ బిజినెస్ కోసం విడిఎన్ ట్రేడర్స్ పేరిట జీఎస్టీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగ ఆ వ్యాపారి నుంచి మహబూబ్ నగర్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి రూ.50వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆ వ్యాపారి ఏసిబి అధికారులను ఆశ్రయించారు. మహబూబ్ నగర్ ఏసిబి డిఎస్పీ కృష్ణయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మహబూబ్ నగర్‌లోని వాణిజ్య పన్నుల అధికారి కార్యాలయంలో వ్యాపారి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటున్న డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఏసిబి బృందాలు పలు చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.

### గద్వాలలో డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి ఇంట్లో ఏసిబి సోదాలు

మహబూబ్ నగర్ జిల్లాలో ఏసిబి రైడింగ్‌లో పట్టుబడిన డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి స్వస్థలమైన గద్వాల పట్టణంలోని వెంకటేశ్వర్ కాలనీలో ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. నల్గొండ ఏసిబి ఎస్ఐలు వెంకట్రావ్, రామారావు ఆధ్వర్యంలో మొత్తం 9 మంది గద్వాలలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డిప్యూటి స్టేట్ టాక్స్ అధికారి దిన్నె వెంకటేశ్వర్ రెడ్డి భార్య ప్రవీణను ఏసిబి అధికారులు విచారిస్తున్నారు. అదే విధంగా అతడి బంధువుల ఇండ్లలో సైతం అధికారులు సోదాలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

## అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

## మంత్రులైనా సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందే

## కఠినంగా హెచ్చరించిన చంద్రబాబు నాయుడు

**విజయవాడ,సెప్టెంబర్3(నమస్తే ఉదయం):** వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. వరదలతో పేదల బాధలు వర్ణణాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి.

అందుతున్న సహాయంపై ఐవీఆర్ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా. అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు.

మీనమేషాలు లెక్కించడం సరికాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తాం.

రెండు రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రులు, అధికారులకు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విపత్తు నిర్వహణలో సరిగ్గా పని చేయకుంటే, మంత్రులకైనా వేటు తప్పదని హెచ్చరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. జక్కంపూడిలో విధులు సరిగా నిర్వర్తించని ఓ

అధికారిని ఇప్పటికే సస్పెండ్ చేశానన్నారు. వీఆర్‌లో పెట్టిన అధికారులు విపత్తు నిర్వహణ బాధ్యతల్లో సక్రమంగా విధులు నిర్వర్తించ లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపైనా విచారణ జరిపిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో వివాదాస్పద అధికారులకు బాధ్యతలు అప్పగింత మంచి ఉద్దేశంతో జరిగిందా? లేక ఓవర్ లుక్‌లో అయిందా? అనేది పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.ఏ రకంగా బాధ్యతలు అప్పగించినా పని చేయాలనే మానవత్వం సదరు అధికారులకు ఉండదా? అని ప్రశ్నించారు. టోల్ ఫ్రీ నంబర్‌లు పనిచేయట్లేదనే ఫిర్యాదును అంగీకరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ 5ఏళ్లుగా పక్షవాతం వచ్చినట్లుగా పడి ఉందని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కొత్త కంట్రోల్ రూమ్ వ్యవస్థ పెట్టి వెంటనే సమస్య పరిష్కరిస్తానన్నారు. బ్యారేజీ వద్దకు బోట్లు ఎలా కొట్టుకొచ్చాయని విచారణ జరిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తప్పుడు వార్తలు ఇచ్చి ఓ వర్గం మీడియా ఇంకా పరువు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఉదయం నుంచి జరిగిన ఆహారం పంపిణీ



వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా విధుల్లో ఉన్న అధికారులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 5 హెలీకాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని సీఎంకు అధికారులు తెలిపారు. హెలికాప్టర్, పడవలు, ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి ఆహారం, నీళ్లు అందిస్తున్నామని వివరించారు. 5 లక్షల ఆహారం, నీళ్ళ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపిణీ చేశామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు.



100 శాతం ఆహారం పంపిణీ జరగాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకోలేని చోటకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా మూడు పూటలా ఆహారం అందించాలని తెలిపారు. 36 డివిజన్లలో విధుల్లో ఉన్న అధికారులే ఆహార పంపణీకి బాధ్యత వహించాలని చంద్రబాబు ఆదేశించారు. ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలి.. చెత్త రాజకీయాలు వద్దు. ఈ పరిస్థితుల్లో గుడ్లవల్లేరు ఘటనపై ఫోకస్ చేస్తారా? ప్రకాశం బ్యారేజీలో బోట్ల ఘటనపై విచారణ చేపడతాం. ఇటీవల కొన్ని ఘటనలు అనుమానాస్పదంగా ఉన్నాయి. బాబాయ్‌నే చంపిన వారు ఉన్నప్పుడు అనుమానాలు వస్తాయి కదా! విపక్ష నేత ఐదు నిమిషాలు వచ్చి షో చేసి వెళ్లారు. ఆయన ఒక్కరికి కూడా ఆహార పొట్లం ఇవ్వలేదు.

ప్రధాని మోదీతో మాట్లాడినప్పుడు మీరున్నారు కదా.. భయం లేదని చెప్పారు. హుద్‌హుద్ సమయంలో నా పనితీరును ఆయన మెచ్చుకున్నారు. నా పట్ల ప్రజల స్పందన చూసి ప్రధాని ఆశ్చర్యపోయారు' అని చంద్రబాబు అన్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా సితార సెంటర్‌కు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. జేసీబీ ఎక్కి వరద కాలనీల్లో పరిస్థితి పరిశీలించారు. ఆహారం అందుతుందా..? లేదా..? అని బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు. స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా అధికారులపై చర్యలు ఉంటాయని చంద్రబాబు తెలిపారు.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733